క్లుప్తంగా

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు



మద్యం సేవించిన వారిని అదుపులోకి తీసుకున్న ట్రైనీ ఎస్ఐ సుమతి

కదిరి టౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని పోలీసులు హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో బహిరం ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ట్రైనీ ఎస్ఐ డి.సుమతి తెలిపారు. పట్టణంలో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు పాల్పడినా, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

నేడు ధర్మవరంలో దివ్యాంగుల క్యాంపు

కనగానపల్లి: ధర్మవరం పట్టణంలోని భవిత కేంద్రంలో సోమవారం నిర్వహించే దివ్యాంగుల క్యాంపుకు మండలంలోని దివ్యాంగుల పిల్లలను తీసుకుని రావాలని ఐఈఆర్టీ ఉపాధ్యాయుడు జగదీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపు ద్వారా దివ్యాంగులైన పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేసేందుకు వారి వివరాలు, పేర్లు నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. పిల్లల వికలాంగ ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, ఫొటోలు తీసుకుని ఉదయం 10 గంటలకు హాజరు కావాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణంలో యువర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులు 75 మందికి కంటి పరీక్షలు చేయగా 46 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికై నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం, కోశాధికారి వంకదారి మోహన్ తెలిపారు. యువర్స్ ఫౌండేషన్ పీఆర్ఓ రాధాకృష్ణ, క్యాంపు చైర్మన్ సికిందర్, సభ్యులు చాంద్‌బాషా, పోలా ప్రభాకర్, వైకే శ్రీనివాసులు, సుకుమార్, కేతా లోకేష్, సీకే రామంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మవరం రూరల్: ఆకుతోటపల్లిలో ఆదివారం ఇంపాక్ట్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ సోమలరాజు శివరాజు ఆధ్వర్యంలో వృద్ధులకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్య కార్యకర్త అరుణ ఈసీజీ పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి హిమోగ్లోబిన్ రక్త పరీక్ష, రక్తపోటు పరీక్షలను చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సలహాదారు సత్యనిర్ధారణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహానికి రంగులు

నల్లచెరువు: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహానికి మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి తన సొంత డబ్బుతో ఆదివారం రంగులు వేయించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ మాట్లాడుతూ వచ్చే నెలలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి రంగులు వేయించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచ్ యూసుఫ్, ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, టెంపుల్ మాజీ చైర్మన్ ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచులు రమణారెడ్డి, అక్బర్, టెంపుల్ మాజీ డైరెక్టర్ గోవిందురెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి సలీం తదితరులు పాల్గొన్నారు.

వెంగముని స్వామి ఆరాధనోత్సవం

ముదిగుబ్బ: మండలంలోని టీఎస్ పాళ్యం గ్రామంలో వెంగముని స్వామి ఆరాధనోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు, వెంగమునిరెడ్డి కుమారులు మాట్లాడుతూ సోమవారం ఆరాధన, మంగళవారం మారుపూజ నిర్వహిస్తామన్నారు.

గొడవలకు దూరంగా ఉండండి



గ్రామస్తులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు

ధర్మవరం రూరల్: గ్రామాల్లో ప్రజలు గొడవలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు సూచించారు. ఆదివారం మల్కాపురం గ్రామంలో సిబ్బందితో కలిసి ఆయన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ చిన్న చిన్న వివాధాలను పెద్దవిగా చేసుకొని ప్రశాంతతను కోల్పోవద్దన్నారు. గ్రామాలలో అందరూ అన్నదమ్ముల్లాగా కలిసి జీవించాలన్నారు. చట్టాలను గౌరవిస్తూ చట్ట పరిధిలోనే నడుచుకోవాలన్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

ఊరు.. ఉసూరుమంటోంది!



ఈ వ్యక్తి పేరు ఎస్. మహేశ్వరరెడ్డి. గత 20 సంవత్సరాలుగా నల్లమాడ బస్టాండ్ కూడలిలో ఓ మోస్తారు బట్టల దుకాణం ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతంలో రోజుకు రూ.2 వేలు నుంచి రూ.3 వేలు వరకు వ్యాపారం జరిగేది. ఆరు నెలల నుంచి వ్యాపారం బాగా తగ్గిపోయిందని, రోజుకు వెయ్యి రూపాయలు వ్యాపారం జరగడం కూడా కష్టంగా ఆవేదన చెంతున్నాడు. దుకాణం అద్దె, కరెంట్ బిల్లు నెలకు రూ.5 వేలు పైబడి కట్టాల్సి ఉందన్నారు. పెట్టుబడి పోను అరకొర మిగులుబాటుతో చేతినుంచి అద్దె చెల్లించాల్సి దుస్థితి నెలకొందన్నాడు.

- పనులు లేవు..ఫైనలూ లేవు
- పడిపోయిన వ్యాపారాలు..
- దిగులు చెందుతున్న వ్యాపారులు

నల్లమాడ: గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏడాది నుంచి పైసా ఆదాయం లేకపోవడంతో సామాన్యుల నుంచి మధ్య తరగతి వరకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఆర్థిక ఇబ్బందులకు తోడు వర్షాభావంతో పంటల సాగు నామమాత్రంగానే ఉంది. రైతులు మొదలుకొని వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కూలీలు, వ్యాపారులు ప్రతి ఒక్కరూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి ఏమాత్రం సహాయ, సహకారాలు లేకపోవడంతో సామాన్యుల కుటుంబ పోషణ భారమైన ట్లు తెలుస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే మళ్లీ వలసబాట పట్టక తప్పదని పలువురు పేర్కొంటున్నారు.

సంక్షేమానికి స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా, జగనన్న విద్యా దీవెన, జగనన్న విద్యా వసతి, వైఎస్సార్ ఆసరా, వాహన మిత్ర, వైఎస్సార్ చేయూత, నేతన్న నేస్తం, కాపు నేస్తం ఇలా ప్రతి వర్గానికి సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమ పథకాలను కనుమరుగు చేసింది.

నల్లమాడ మండలంలో వివిధ దుకాణాల సంఖ్య కింది విధంగా ఉన్నాయి..	
బట్టల షాపులు	30
కిరాణా అంగళ్లు	50
ఫ్యాన్సీ స్టోర్లు	07
ఐరన్‌మార్ట్‌లు	03
సిమెంట్ అమ్మకం షాపులు	08
పాల డైరీలు	04
సెల్‌ఫోన్ రిపేరీ సెంటర్లు	06



జన సంచారం లేక బోసిపోయిన నల్లమాడ ప్రధాన కూడలి

నిర్వీర్యమైన ఉపాధి హామీ

గ్రామీణ కూలీలకు కల్పతరువుగా ఉన్న జాతీయ ఉపాధి హామీ పథకం ప్రస్తుతం నిర్వీర్యమైనట్లు అధికార వర్గాలే చెబుతున్నాయి. ఈ పథకం క్రింద పండ్ల మొక్కలు నాటుకున్న రైతులకు నెలల తరబడిగా మెటీరియల్ బిల్లులు అందడం లేదు. కూలీలకు సైతం దాదాపు మూడు నెలలుగా బిల్లులు అందలేదని కూలీలు వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదట్లో ఉపాధి హామీ నిధులతో ఆర్భాటంగా చేపట్టిన సీసీ రోడ్లకు సంబంధించి ఇప్పటికీ బిల్లులు ఇవ్వలేదని పనులు చేసిన అధికార పార్టీ నాయకులే వాపోతున్నారు.

వ్యాపారుల బేజారు..

ఏడాది నుంచి అన్ని రకాల వ్యాపారాలు ఢీలా పడినట్లు వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యావసర సరుకులు, మందులు మినహా వస్త్ర దుకాణాలు, ఫ్యాన్సీ స్టోర్లు, బంగారు షాపులు, సిమెంట్, ఐరన్ మార్ట్‌లు ఇలా అన్ని రకాల వ్యాపారాలు పూర్తిగా తగ్గిపోయినట్లు వ్యాపారులు ఆవేదన చెంతున్నారు. వ్యాపారాలు లేకపోవడంతో నెల బాడుగ చెల్లించడానికి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఇంత దుర్భర పరిస్థితి ఎన్నడూ చూడలేదని వారు నిట్టూరుస్తున్నారు. ప్రజల వద్ద డబ్బు లేకపోవడమే ఇందుకు కారణంగా చెబుతున్నారు.

అడిగేవారే లేరు



బంగారం ధర పెరగడంతో పాటు కరువు పరిస్థితి ఏర్పడటంతో బంగారు ఆభరణాలు అడిగేవారు కరువయ్యారు. ఏమి కొనాలన్నా, ఏం తినాలన్నా ప్రజల వద్ద డబ్బు చలామణి కావడం లేదు. ఆదాయ వనరులు పూర్తిగా తగ్గిపోయాయి. ఆ ప్రభావం వ్యాపారాలపై స్పష్టంగా కనబడుతోంది. ప్రజల వద్ద డబ్బు ఉంటే అన్ని వ్యాపారాలు జరుగుతాయి.

– సోమశేఖరాచారి, జ్యువేలరీ షాపు నిర్వాహకుడు, నల్లమాడ

పనులు లేవు



చేతిలో డబ్బులు లేకపోవడంతో ఇండ్లు కట్టడం చాలా తగ్గిపోయింది. మాకు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నాం. సంసారాలు జరగడం కూడా కష్టంగా ఉంది. ప్రభుత్వం క్వార్టర్స్ మంజూరు చేసింటే పనులు దొరికేవి. ఇప్పటికే చాలామంది కార్మికులు హైదరాబాదు, బెంగళూరుకు వలసలు పోయారు.

– కే. కేశవ, మేస్త్రీ, పెమనకుంటపల్లి, నల్లమాడ మండలం

ఏడాది నుంచి 'ఉపాధి' బిల్లులు అందలేదు



ఉపాధి హామీ కింద రెండేళ్ల క్రితం రెండెకరాల్లో 140 మామిడి మొక్కలు నాటా. మొదటి సంవత్సరం బిల్లులు బాగానే వచ్చాయి. ఇప్పుడు ఒక సంవత్సరం నుంచి బిల్లులు రావడం లేదు. బిల్లులు మంజూరు చేయాలని చాలాసార్లు అడిగా. పట్టించుకొనే నాథుడే లేరు.

–చిన్నప్పయ్య, రైతు, దొన్నికోట,నల్లమాడ మండలం

రేషన్ డీలర్‌పై సస్పెన్షన్ వేటు



రేషన్ షాపును తనిఖీ చేస్తున్న డీఎస్ఓ వంశీకృష్ణారెడ్డి

సాక్షి ఎఫెక్ట్..

ధర్మవరం రూరల్: రావులచెరువు పంచాయతీకి చెందిన ఆర్.యర్రగుంటపల్లి గ్రామానికి చెందిన రేషన్ డీలర్‌ను జిల్లా అధికారులు ఆదివారం సస్పెండ్ చేశారు. ఆదివారం 'రేషన్ డీలర్‌పై గ్రామస్తుల ఆగ్రహం' శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వంశీకృష్ణారెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ చెన్నకేశవనాయుడు, డీఎస్‌ఓ గురుప్రసాద్ గ్రామానికి చేరుకుని డీలర్ పనితీరుపై విచారణ చేపట్టారు. ఫిర్యాదు చేసిన కార్డుదారులతో వివరాలు సేకరించారు. విచారణలో కార్డుదారులకు బియ్యాన్ని తక్కువగా ఇస్తున్నట్లు తేలడంతో అక్కడికక్కడే డీలర్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతానికి ఇబ్బందులు లేకుండా వీఆర్‌ఓ ద్వారానే కార్డుదారులకు రేషన్ సరుకులను పంపిణీ చేస్తామని అధికారులు తెలియజేశారు.

పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నూతన కమిటీ ఎంపిక



జిల్లా కమిటీని ఎంపిక చేస్తున్న రాష్ట్ర కన్వీనర్ శంకర్

ధర్మవరం: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ కళాశాల బాలుర వసతిగృహంలో ఆదివారం పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ కన్నెలూరు శంకర్ ఆధ్వర్యంలో నూతన జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. పీఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్‌గా మధుసూదన్‌రెడ్డి, కోకన్వీనర్‌గా అరవింద్, కమిటీ సభ్యులుగా నంద, చరణ్, అశోక్, మణిపాల్, విక్రమ్‌ను ఎంపిక చేశారు. విద్యారంగ సమస్యలు, యువత సమస్యలపై నిరంతరం పోరాడుతామని వారు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర నాయకులు ఓరుగంటి నాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సూపర్‌వైజర్ మృతి

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమి ఆరోగ్య కేంద్రంలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న గిరినాథ్ రావు(50) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది ఆయన మృతికి సంతాపం తెలిపారు.

ఉపాధ్యాయుల క్రికెట్ టోర్నీ ప్రారంభం



విజేత జట్టు

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కదిరి డివిజన్ పరిధిలోని ఉపాధ్యాయులు ఆదివారం స్నేహపూర్వక క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. తొలిరోజు జరిగిన ఫస్ట్ మ్యాచ్‌లో గాండ్లపెంట జట్టుపై నల్లమాడ జట్టు గెలిచింది. రెండవ మ్యాచ్‌లో తనకల్లు జట్టుకు కదిరి జట్టు, మూడవ మ్యాచ్‌లో ఎన్పీకుంట జట్టుపై ముదిగుబ్బ జట్టు విజయం సాధించింది. కార్యక్రమంలో నల్లమాడ ఎంఈఓ వెంకట్రాముడు, అధ్యాపకులు జే వీ రమణ, రామిరెడ్డి, తాహిర్‌వలీ, శ్రీనివాసులు, ఆజం, అశ్వర్థ, రుద్రమరెడ్డి, నాగరాజుతో పాటు పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు తరలిరండి

పెనుకొండ: సర్పంచ్‌ల సమైక్య శంఖారావం చలో విజయవాడ కార్యక్రమం ఈ నెల 5న నిర్వహిస్తున్నామని, కార్యక్రమానికి సర్పంచులు పెద్ద ఎత్తున తరలిరావాలని పెనుకొండ మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నాగరాజు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 7 నెలల క్రితం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 111 కోట్లు తక్షణం గ్రామ పంచాయతీలకు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చలో విజయవాడ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ స్పందించాలన్నారు. తమ సమస్యలను పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఇంటి స్థలాలు క్రమబద్ధీకరించుకోండి

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేని లేఔట్లలో కొనుగోలు చేసిన ఇంటి స్థలాలను యజమానులు నామమాత్రపు రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకోవాలని మున్సిపల్ కమిషనర్ జగన్నాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటి స్థలం విలువ ఆధారంగా రుసుం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు



గోరంట్లలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

పుట్టపర్తి టౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని పోలీసులు వాహనదారులను హెచ్చరించారు. ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పోలీసులు జిల్లా వ్యాప్తంగా ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చట్టవ్యతిరేక కార్యకలాపాలను అరికట్టేందుకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. గంజాయి. ఇతర మాదక ద్రవ్యాలు అక్రమ రవాణా, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, వాహనాల రికార్డుల పరిశీలన, పెండింగ్ చలానాలు పరిశీలించామన్నారు. వాహనదారులు వాహన రికార్డులు దగ్గరే ఉంచుకోవాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించేవారు సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఇదిలా ఉండగా కొన్నిచోట్ల పాతనేరస్తులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

లారీ - టెంపో ఢీ



మడకశిర: పట్టణంలోని వాల్మీకి సర్కిల్‌లో ఆదివారం ఓ టెంపో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొంది. రోడ్డు పక్కన నిలబెట్టిన ఓ బైక్‌పైకి దూసుకెళ్లడంతో నుజ్జునుజ్జయింది. అలాగే మహిళతో పాటు ఇద్దరు పిల్లలు స్వల్పంగా గాయాలపాలయ్యారు. స్థానిక పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి

- మండలంలో పెరిగిన సాగు
- లాభదాయకమంటున్న రైతులు
- మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు

తనకల్లు: వర్షాభావ పరిస్థితుల కారణంగా గత కొన్నేళ్లుగా సాంప్రదాయ పంటైన వేరుశనగను సాగు చేసి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. పెట్టిన పెట్టుబడి కూడా రాకపోవడంతో ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. దీంతో చాలా మంది కూరగాయ పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. నిత్యావసరాల్లో ఒకటైన కూరగాయల ధరలు మార్కెట్లో నిలకడగా ఉండడంతో చాలా మంది రైతులు ప్రస్తుతం వాటి సాగుపై దృష్టి సారించారు. మండల వ్యాప్తంగా పలు రకాల కూరగాయాలను దాదాపు 380 హెక్టార్లలో సాగు చేశారు. ఇందులో టమాటా, దబ్బ చిక్కుడు, వంకాయ, బీర, కాకర, బెండ తదితర కూరగాయాల పంటలు ఎక్కువగా ఉన్నాయి. గతంతో పోల్చితే మండలంలో కూరగాయాల సాగు పెరుగుతోంది.

నిలకడగా ధరలు

సాధారణంగా ఇక్కడ పండించే టమాటను ప్రధానంగా మదనపల్లి మార్కెట్‌కు తరలిస్తారు. అక్కడ టమాట 33 కిలోల బాక్సు రూ.1,100 నుంచి 1200 వరకు పలుకుతోందని రైతులు చెబుతున్నారు. వంకాయ, చిక్కుడు ఎక్కువగా చెన్నై మార్కెట్‌కు తీసుకెళతారు. ప్రస్తుతం అక్కడ వంకాయ బస్తా (50 కిలోలు) రూ.15,00 నుంచి రూ.2,000, చిక్కుడు బస్తా (50 కిలోలు) రూ.2,000 నుంచి రూ.2,500 పలుకుతున్నట్లు రైతులు పేర్కొన్నారు. మిగిలిన కూరగాయాలను కదిరి, తనకల్లు, కొక్కంటిక్రాస్, మొలకలచెరువు, బీ. కొత్తకోట, చేలూరు తదితర మార్కెట్లలో విక్రయిస్తున్నారు. ఆయా మార్కెట్లలో కూరగాయల ధరలు నిలకడగా ఉండడంతో రైతులకు నష్టాలు లేకుండా లాభాలు వస్తున్నాయి. అలాగే దిగుబడి కూడా ఆశాజనకంగా ఉండడంతో సాగు చేసిన కూరగాయలకు గిట్టుబాటు ధర లభిస్తోందని పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చీకటిమానిపల్లి వద్ద సాగులో ఉన్న టమాట పంట



గోవిందువారిపల్లి సమీపంలో సాగులో ఉన్న చిక్కుడు

మార్కెట్ సౌకర్యం లేక ఇబ్బందులు

మండలంలో రైతులు పండించిన పంటలకు సరైన మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. తనకల్లు, కొక్కంటి క్రాస్‌లో జరిగే వారపు సంతలు తప్ప పెద్దగా మార్కెట్ సౌకర్యం లేదు. దీంతో దూర ప్రాంతాలైన చెన్నై, మదనపల్లి, కోలార్, బాగేపల్లి, బెంగళూరు, తిరుపతి తదితర మార్కెట్లకు తరచూ కూరగాయలను తరలిస్తున్నారు. సరుకు రావాణా కోసం వేలాది రుపాయిలు చేతి నుంచి చెల్లించాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. అష్టకష్టాలు పడి అంతదూరం తీసుకెళ్లినా మార్కెట్లో ఉండే దళారులు ఎంత చెబితే అంతకు సరుకును ఇవ్వాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్థానికంగానే మార్కెట్ సదుపాయాన్ని కల్పిస్తే తమకు ఎంతగానో ప్రయోజనకరంగా ఉంటుందని రైతులు కోరుతున్నారు.


మంచి లాభాలు చూస్తున్నాం



నేను ఎక్కువగా కూరగాయలను సాగు చేస్తుంటా. కూరగాయల సాగులో మంచి లాభాలు వస్తున్నాయి. ఇంతకుముందు మూడన్నర ఎకరాల్లో టమాట సాగు చేశారు. పంట కోసం రూ. 4 లక్షలు వరకు ఖర్చు చేశాను. ఖర్చులన్నీ పోనూ ఎకరాకు రూ.2 లక్షలకు పైగానే లాభం వచ్చింది. ప్రస్తుతం నాలుగు ఎకరాల్లో టమాట సాగు చేశాను. ఇప్పుడు టమాటకు మార్కెట్లో మంచి ధరలున్నాయి. కూరగాయల పంటలతో లాభాలు వస్తున్నాయి.

– హిమధర్‌రెడ్డి, రైతు, సున్నంపల్లివారిపల్లి

స్మార్ట్ మీటర్ల ఏర్పాటు విరమించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం, సీపీఐ నాయకులు

ధర్మవరం: కూటమి ప్రభుత్వం స్మార్ట్ మీటర్ల ఏర్పాటును విరమించుకోవాలి సీపీఎం, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ చార్జీల పెంపుపై మంగళవారం విద్యుత్‌శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు ప్రకటించారు. స్థానిక సీఐటియు కార్యాలయంలో ఆదివారం సీపీఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మధు, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్ బాషా, పట్టణ కార్యదర్శి మారుతి, సీఐటీయూ నాయకులు జేవీ రమణ, ఆయుబ్‌ఖాన్ విలేకరులతో మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు పగలకొట్టాలని నారా లోకేష్, సీఎం చంద్రబాబు పిలుపునివ్వడం జరిగిందన్నారు. కాని అధికారం వచ్చి సంవత్సరం పైబడినా గతంలో బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగించలేదన్నారు. ఇప్పటికే వ్యాపారాలు లేక అనేక రకాల ఇబ్బందులకు గురవుతుంటే మూలిగే నక్కపై తాటి కాయ పడ్డట్టు స్మార్ట్‌మీటర్లుతో మరింత భారం మోపుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు బిగించే ప్రయత్నం మానుకోవాలని, బిగించిన స్మార్ట్ మీటర్లు తొలగించాలని డిమాండ్ చేశారు.

జాతీయ రహదారిపై గుంతల పూడ్చివేత



రోడ్డు మరమ్మతు చేయిస్తున్న దృశ్యం

ధర్మవరం: బత్తలపల్లి మండలం సంజీవపురం దగ్గర 42వ జాతీయ రహదారిపై పడిన గుంతలను ఆదివారం నేషనల్ హైవేస్ ఏఈ లక్ష్మీనరసయ్య ఆధ్వర్యంలో గ్రామస్తులు ముళ్లగురు వెంకటేష్, సూరి, పురుషోత్తం, సంజీవు, నంద తదితరులు పూడ్చివేశారు. గుంతల పూడ్చివేతపై వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.